# కొత్తపిట్టా పాతవలా

– యర్రంశెట్టి శాయి

"ఏమండీ !"

హాండ్ బాగ్ స్టయిల్‌గా ఊపుకొంటూ అందంగా నడుస్తోన్న రాధ వెనక్కి తిరిగి చూసింది.

టక్ చేసుకొని, టై కట్టుకొని, లెదర్ బాగ్ చేతిలో ఉన్న యువకుడు తన వేపే వస్తూ ఆగమన్నట్టు చేయి ఊపడం కనిపించిందామెకు.

ఇది చాలా విచిత్రంగా కనిపించింది. పైగా అతన్నింతకు ముందెప్పుడూ ఎక్కడా చూసిన గుర్తులేదు.

దగ్గరకొచ్చాడతను.

కూలింగ్ గ్లాసెస్, మూతిమీద సన్నని మీసం - చెంపలు అల్లుకుపోయిన సైడ్ బరన్స్-బాగానేవుంది అవతారం.

కళ్ళజోడుతీసి చిన్నగా నవ్వాడతను.

"మీరు నన్ను గుర్తుపట్టినట్లు లేదు... మీ పేరు సులోచనేనా?...సరిగ్గా గుర్తు లేదు."

తమాషాగా ఉంది రాధకు. అడ్డమయినవాళ్ళనీ గుర్తుపట్టడానికి. ఇదేమయినా అయిడెంటిఫికేషన్ కౌంటర్ అనుకొన్నాడా? హెడ్ పోష్టాఫీసులో ఆ సౌకర్యం ఉంది. అక్కడగానీ నీకు సరయిన చికిత్స దొరకదు. అక్కడికెళ్ళమని చెప్దామనుకొంది గానీ-అసలు వీడిని ఎవడుమాత్రం ఎందుకు గుర్తుపట్టాలీ అని చెప్పకుండా ఊరుకుండిపోయింది.

కనీసం దగ్గరికొచ్చాక "సారీ! మిమ్మల్ని దూరంనుండి చూసి మా సులోచన అనుకొన్నాను..." అంటాడేమో అని ఆశపడింది. కాని కచ్చితంగా తను తెలుసున్నట్టు మాట్లాడటం ఏ మాత్రం నచ్చలేదు రాధకి.

"నాకు తెలుసులెండి! మీరు గుర్తుపట్టలేరు నన్ను. పదేళ్ళు దాటిపోయింది మీరు నన్ను చూసి.. ఎలా గుర్తుంటుంది?"

నవ్వుతూ అన్నాడతను. అతని నవ్వు చూస్తూండగానే 'జూ'లో ఏదో జంతువు-దాని పేరు గుర్తురావటంలేదు-సకిలిస్తున్న పోజు గుర్తుకొచ్చింది.

ఛటుక్కున ఓ ఆలోచన విద్యుత్తులా తట్టిందామెకి.



'అవును! కాసేపు తను సులోచనలా నటిస్తే? అబ్బాయిగారి అసలు రంగు బయటపడుతుంది గదా!'

"మనం ఆ హోటల్లో కూర్చుందాం రండి! ఈ రోడ్డుమీద ఒకరికొకరు వివరాలు చెప్పుకొని గుర్తించేసరికి కనీసం అయిదొందలమందేనా విడ్డూరంగా మన చుట్టూ మూగుతారు..." అన్నాడతను.

'ప్లాన్ బాగానే ఉందోయ్! పైకొస్తావ్!' అనుకొంది రాధ.

"పదండి..." అంది హోటల్ వేపు నడుస్తూ.

ఇద్దరూ ఎదురుగ్గా ఉన్న ఎయిర్ కండిషన్డ్ హోటల్లోకి నడిచి ఎవ్వరూలేని ఓ మూల కూర్చున్నారు.

సర్వర్ వచ్చి విసుగ్గా పోజిచ్చి నుంచున్నాడు.

''ఏస్!''

"మనం చాలాకాలం తర్వాత కల్సుకొన్న స్కూల్ ఫ్రెండ్స్ం. అందుకని ఈ అద్భుతాన్ని ఇప్పుడే సెలబ్రేట్ చేసుకొందాం...మీకేంకావాలో చెప్పండి."

రాధకి క్లూ దొరికింది.

అంటే ఇతగాడూ, ఆ సులోచనా - (ఒకవేళ ఆ సులోచన అనే పదార్థం, నిజంగా ఉండి ఉంటే)-స్కూల్లో స్నేహితులయి ఉండాలి. ఫరవాలేదు. స్కూల్ తాలూకుభాగం తేలిగ్గా నటించెయ్యొచ్చు. ఆ సులోచనేకాదు. ఏ సులోచనకయినా స్కూల్లో సాధారణంగా ఒకేరకమయిన అనుభూతులూ-అనుభవాలూ ఉంటాయి. ఇక పూర్తి వివరాలంటే ఎలాగూ ఎవ్వరికీ గుర్తుండవు.

"నాకు ఏదయినా కూల్ డ్రింక్..." అది రాధ.

''రెండు లిమ్కా తీసుకురా!'' ఆర్డరిచ్చాడతను.

సర్వరు వెళ్ళిపోయాడు. ' అదివరకు మీరేఊళ్లో ఉండేవారు?'' అడిగాడతను.

"కైకలూర్లో!" అబద్ధ మాడేసింది రాధ.

"కైకలూర్లో థర్డ్‌ఫారంలో ఆడపిల్లల వెనుక బెంచీలో కూర్చున్న కుర్రాళ్ల మీకు గుర్తున్నారా?''

రాధ ఓ క్షణం ఆలోచించినట్లు నటించింది.

''అంతా గుర్తులేరు గానీ ... ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు—వాళ్ళయినా ఎందు గ్గుర్తున్నారంటే-ఏదో వెధవపని చేశారన్జెప్పి-వెధవపనంటే-

అదే-స్కూల్ దగ్గరున్న చాకలాడి గాడిదలను ఎత్తుకుపోయి స్వారీచేశారని హెడ్మాష్టర్—వాళ్ళని ప్రేయర్ టైంలో అందరిముందూ కేన్‌పెట్టి టినోపాల్ లేకుండా ఉతికాడు, అందులో ఒకడి పేరు నరసింహారావు-లక్ష్మణరావు-నర్సరాజు."

అతనిముఖం చిన్నబోయిందిగానిమళ్లీ ఉత్సాహం పుంజుకున్నాడు..

''స్టాప్...''అన్నాడు నవ్వుతూ.

"ఆ నర్సరాజుని నేనే..."

''ఈజిట్?''.. ఆశ్చర్యపడ్డట్లుచూసిందామె.

''ఛంపేశారు. మీ కసలు అప్పటికీ ఇప్పటికీ పోలికేలేదు. అదివరకుసన్నగా క్రాఫూ అదీ-బావుండేవారు..."

నర్సరాజు నవ్వాడు గానీ-ఏడ్చాశం చేసే బావుంటుంది.

''అవును! బాగా లావెక్కిపోయానంటారు చాలామంది. మీలో కూడా చాలా మార్పుంది గానీ, మొత్తానికి



యువ

గుర్తించలేనంత మార్పుమాత్రం రాలేదు. పైగా జ్ఞాపకశక్తి ఉంది చూశారూ..."

"చూళ్లేదు .." అంది రాధ.

"అహహ...మాటొరసకంటున్నాను. అంచేత మిమ్మల్ని తకీమని గుర్తించేశాను..."

సర్వర్ రెండు డ్రింక్‌లుతెచ్చి టేబుల్ మీదుంచాడు.

ఇద్దరూ చెరోటీ అందుకొన్నారు.

"మన ఇంగ్లీష్ మాష్టరుండేవారు గుర్తుందా? స్కూల్ రోజులే మనిషి జీవితంలో నెమరేసుకోడానికి మిగిలేది! అంచేత పోట్లాడుకోకుండా ఈ కాసిని రోజులూ సంతోషంగా గడపండి..." అని," అసలుమీకు మన ఇంగ్లీషుమాస్టరు గుర్తున్నారా?"

అసలు నువ్వెవరో తెలిసేడిస్తేగా నీ ఇంగ్లీష్ మాష్టర్ని గుర్తుపట్టడానికీ అనుకొంది రాధ.

"ఓ గుర్తున్నారు. ఆయన్నెలా మర్చిపోగలం?" అంది రానినవ్వు తెచ్చిపెట్టుకొంటూ.

"సరే! స్కూల్ గొడవలలా ఉంచండి కాసేపు. మనిద్దరం ఇక్కడుండే వాళ్ళమే కాబట్టి—ఇఫయామ్ కరెక్టు-తీరిగ్గా నెమరేసుకోవచ్చు. ప్రస్తుతం గురించి చెప్పండి. మీరేం చేస్తున్నారిక్కడ? హైద్రాబాదొచ్చి ఎన్నేళ్ళయింది? మీకు మారేజయిందా?" అడిగాడతను.

"మేము హైద్రాబాదొచ్చి ఎనిమిదేళ్ళయిపోయింది. ఇక్కడే సెటిల్ అయిపోయినట్లే! ఇంకా మారేజ్‌కాలేదు. సెక్రటేరియట్‌లో టెంపరరీగా పన్జేస్తున్నాను. మరి మీ సంగతి?..." నోటికొచ్చినట్లు చెప్పేసింది రాధ.

"నేనా?" ఫెళ్ళున నవ్వాడతను.

"మాది చాలా పెద్ద డిపార్టుమెంట్ లెండి_నిరుద్యోగడిపార్ట్‌మెంట్_ప్రస్తుతం రెండు పార్టు టైమ్ ఉద్యోగాలు చేస్తున్నాను అదీ మా సంగతి. సిసలైన ఉద్యోగం దొరికేవరకూ పెళ్ళిమాటెత్తొద్దని మా వాళ్ళకు వార్నింగిచ్చేశాను... ...అన్నట్లు ఇక్కడ ఇంకా మీవాళ్లెవరయినా జాబ్ చేస్తున్నారా?..."

"మా బ్రదర్ కూడా ఇక్కడే జాబ్ చేస్తున్నారు..."

"వెరీగుడ్! అయితే మనం ఇక తరచు కలుసుకుంటూండొచ్చు...ఏమంటారు?"

"ఓ! తప్పకుండా."

"మా ఇల్లు కూడా ఇక్కడే...మీకు చూపిస్తానునాతోరండి_అయిదు నిమిషాల నడక ఇక్కడకు..."

"అంటే మీ వాళ్ళందరూ ఇక్కడే ఉంటున్నారా?"

"అబ్బే! నాకే తికానాలేదు. వాళ్లెందుకిక్కడ! ఎవరయినా ఇలా పాతస్నేహితులు కనబడితే సర్వస్వం మర్చిపోతానండీ. అదోవిధమయిన పిచ్చిఆనందం

అంతే! ఆ మధ్యనా లక్ష్మణరావుగాడు కనబడ్డాడు...''

''ఎవడా లక్ష్మణరావుగాడు?...''

"అదే! వాడే!మీరుచెప్పలా చాకలిగాడి దల నెత్తుకుపోయి స్వారీచేసిన వాళ్ళల్లో అగ్రగణ్యుడు - హెడ్మాష్టరు వాడినే ముందు కొట్టిందసలు" రాధ నవ్వుకొంది.

"ఓరి నర్సరాజూ! నేను సర్దాగా నిన్నేడిపిస్తానికి చెప్పిన కథని తీసుకొచ్చి నిజమని మళ్ళీ నాకే చెప్తున్నావా?... హాట్సాఫ్ నీ తెలివికి...''

"వాడు బొంబేలో అదేదో పెద్ద స్టూడియోలో సౌండ్ ఇంజనీర్ అంట. అర్జంటుగా సౌండ్ పనిమీద ఈ ఊరువచ్చాట్ట అంతే, రెండ్రోజులు నా రూమ్‌లో కట్టేశాను వాడిని...''

కిలకిల నవ్వేసింది రాధ.

"చూశారా, మీ నవ్వుకూడా ఏమీ మారలేదు. అదివరకు లాగానే అందంగా నవ్వుతున్నారు...చాలా మందికి నవ్వు ఎలా నవ్వాలో కూడా తెలీదండీ బాబూ...''

సర్వర్‌కి బిల్లిచ్చేశాడతను.

"ఇక వెళ్దామా?''

"పదండి!"

ఇద్దరూ బయటకు వచ్చారు.

''పదండి! మా రూమ్‌కెళ్దాం!కాసేపు కూర్చుని వెళ్దురుగాని...మళ్ళీ టాక్సీలో మీ ఇంటిదగ్గర దిగబెడతాను లెండి..."

టైమ్ చూసుకొంది రాధ.

"సారీ! ఇప్పుడు వీల్లేదండీ! మా ఫ్రెండ్ ఒకామె ఎదుర్చూస్తుంటుంది నా కోసం...మరోసారి వస్తాను..."

అతను కొంచెంగా నిరుత్సాహ పడ్డాడు.

"మళ్ళీ ఎప్పుడు?...అసలు మిమ్మల్నెలా కలుసుకోవడం?"

"మాయింటి అడ్రస్ రాసిస్తాను, రండి! సాయింత్రం అయిదుతర్వాత ఏరోజొచ్చినాసరే ఇంటిదగ్గరే ఉంటాను. మీరొస్తే మీతోపాటు అప్పుడు రూము కొస్తాను...సరా?"

"సరే! మీ ఇష్టం! మీకెలా వీలయితే అలాగే..." అయిష్టంగానే అన్నాడతను.

బాగ్‌లోనుంచి డైరీతీసి అందించాడతను.

"అడ్రస్ రాయండి!"

అందులో అడ్రస్ రాసింది రాధ.

"మరి...ఇక ఉంటాను..." అంది డైరీ అతనికందిస్తూ.

"ఓ.కే ... ఓ.కే ... రెండ్రోజుల్లో వస్తాను మీ ఇంటికి..."

"ష్యూర్!" అంది రాధ ముందుకి నడుస్తూ.

ఆమె దూరంగా వెళ్ళేంతవరకూ చూస్తూండిపోయాడు నర్సరాజు. కాసేపటికి హోటల్లోంచి బయటికొచ్చి అతని భుజంమీద చేయివేశాడు మరొకతను.

"ఏరా కిష్టిగా! ఏమయిందిపిట్ట?" అడిగాడు నవ్వుతూ.

"కొంచెంలో దెబ్బతిందిరా ప్లానంతా! పిట్టకొంచెం గడుసరిలాగా కనబడు తోంది. అంతా కరెక్టుగానే జరిగింది, షుమారుగా ఊహించి 'సులోచనా' అని పిలచానా! సరిగ్గా ఈ పిట్టదికూడా అదే పేరు. థర్డ్‌ఫారమయినా చదవక పోయుంటుందా అని ఊహించి స్కూల్లో ఆ రోజుల గురించి మాట్లాడాను. అంతే. ఠకీమని మన వలలో పడిపోయింది. ఎవడో నర్సరాజు పేరు చెప్పింది. వాడే నేనన్నాను.

ఇకమిగతాదంతా మాప్రక్క టేబుల్ మీదకుచేరి వింటూనే ఉన్నావుగా నువ్వు. అంతే! కాని ఎక్కడికీ తప్పించుకు పోలేదులే! అడ్రసిచ్చింది. మరో రెండ్రోజుల్లో రూముకి కొట్టుకొచ్చేస్తాను..."

రాధ సరాసరి సుభద్ర ఇంటికి చేరుకొంది.

"ఫస్ట్‌షో కెళ్దామన్జెప్పి ఇప్పుడా వచ్చేది?" అడిగింది సుభద్ర.

"ముందే వచ్చేదాన్నేనే! దార్లో ఓ పక్షికలిసింది..."

"పక్షా?"

"అవును...ఆ జాతికి చెందినదే..."

సుభద్ర నవ్వేసింది.

"పక్షులభాషకూడా వచ్చన్నమాట నీకు..."

"ఓ! ఎగరటంకూడా నేర్పుతాను వాటికి..."

"ఇంతకు ఏమంటుందా పక్షి?..."

వెనుకనుంచి నన్ను చూసి 'ఏమండోయ్,' అనిపిలచాడు. చత్వారపు పక్షేమో అనుకొన్నాను. దగ్గరకొచ్చి చూసికూడా అదే చిలకపలుకులు పలుకుతున్నాడు. ఆడకూతుళ్ళను వల్లోవేసుకొనే విద్యలో కొత్తపాఠాలు మొదలెట్టాడన్న సంగతి వాడిని చూడగానే గ్రహించాను. వాడి తిక్క కుదురుద్దామని నేను సులోచనయాను కాసేపు. ఇద్దరం కూల్ డ్రింకులు తాగాం. నేను థర్డ్‌ఫారంలో ఫలానా అన్నాడు అలాగా అన్నాను. అసలు నేను ఇవేమీ చదవకుండా డైరక్ట్‌గా మెట్రిక్ కెళ్ళినసంగతి ఆ పక్షికేం తెల్సు?...మాది కైకలూరు కాదన్న సంగతీ తెలియనీయకుండా నాటకం ఆడాను. ఆ వరకు వాడిగదికి రమ్మంటాడు. ఓర్నిన్ను పెట్రోల్‌పోసి తగలెయ్యా అనుకొని "నువ్వే మా ఇంటికి రమ్మన్జెప్పి అడ్రసిచ్చాను..."

"మళ్ళీ అదేంపని వాడొస్తే?"

"వాడితాతకూడా రాలేడు. ఆ అడ్రసి మా బాబాయివాళ్ళది. ఆయన యాంటీ గుండాస్క్వాడ్ సబిన్‌స్పెక్టర్. మళ్ళీ ఓ డజను జన్మలవరకూ, మరే ఆడపిల్లవంకా చూడకుండా మందిచ్చేస్తాడు..." నవ్వుతూ అంది రాధ.

"వాడి ఖర్మ! మనకెందుగ్గానీ. పద పిక్చర్‌కి టైమవుతోంది..." ఇద్దరూ బయటకు పరుగెత్తారు.

— —